మాటిచ్చారు.. నెరవేర్చారు!

- చిట్టూరు వద్ద పెన్నానదిపై రూ.3.70 కోట్ల తో బ్రిడ్జి నిర్మాణం
- నెరవేరిన సీఎం వైఎస్ జగన్ హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


2017 డిసెంబర్ 6 న చిట్టూరు సమీపంలో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


చిట్టూరు వద్ద పెన్నానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి

పెద్దవడుగూరు : ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చారు. దశాబ్దాల సమస్య నుంచి ప్రజలకు విముక్తి కలిప్పంచారు. వివరాల్లోకెళితే.. మండలంలోని చిట్టూరు నుంచి శింగనమల మండలం తరిమెల గ్రామానికి దాదాపు రెండున్నర కిలోమీట్లరు పెన్నానదిలో నడవాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పాలకులు మారినా ప్రజల సమస్యను పరిష్కరించలేకపోయారు. ఇలాంటి సమయంలో 2017 డిసెంబర్‌లో అప్పటి ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో భాగంగా గుత్తిఅనంతపురం మీదుగా విరుపాపురం, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, కొట్టాలపల్లి, గంజిగుంటపల్లి, చిట్టూరు మీదుగా శింగనమల మండలం తరిమెల గ్రామానికి పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో ఆయా గ్రామాల ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులు వైఎస్ జగన్‌కు వివరించారు. దీంతో ఆయన తాను అధికారంలోకి రాగానే పెన్నానదిలో బ్రిడ్జి నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.

పూర్తి కావొచ్చిన బ్రిడ్జి నిర్మాణం

ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా బ్రిడ్జి నిర్మాణానికి 3.70 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య బ్రిడ్జికి ఇరువైపులా సీసీరోడ్డు నిర్మానానికి మరో రూ.5 కోట్లు కేటాయించేలా చొరవ చూపారు. దీంతో సీసీరోడ్డు పనులు కూడా ప్రారంభమయ్యాయి. చిట్టూరు నుంచి తరిమెల వరకూ బ్రిడ్జితోపాటు సీసీరోడ్డు నిర్మాణం పూర్తయితే చిట్టూరు, రాంపురం, రామరాజుపల్లి, చిత్రచేడు తదితర గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సులభతరమవుతుంది. మొత్తం మీద బ్రిడ్జి, సీసీరోడ్డు నిర్మాణంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



పెన్నానదిలో రెండు కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లే సమయంలో ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. మాగ్రామంలో పాదయాత్ర జరిగిన సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా సమస్యను స్వయంగా తెలుసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. మేము సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి రుణపడి ఉంటాం.

– పతక నాగభూషణ, చిట్టూరు

కల సాకారమైంది



పెన్నానదిలో బ్రిడ్జి నిర్మాణం ఈ ప్రాంత వాసుల కల. దశాబ్దాల తరబడి పెన్నానదిలో వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డాం. మా సమస్య వినే వారే తప్ప తీర్చవారు లేరు. కానీ వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఆయన పుణ్యాన మా కల సాకారమైంది. ఇక నుంచి పెన్నానదిలో మా ప్రయాణం సులువుగా సాగుతుంది.

–శ్రీరాములు, చిట్టూరు

క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక


స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

శింగనమల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలం నుంచి నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ఎంఈఓ నరసింహరాజు ఆదివారం తెలిపారు. ఒక్కోవిద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పి.సింధూజరెడ్డి, డి. నిహారిక, బి. సాయిశ్రీ, నలకంచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పి.బి.స్వాతి ఎంపికయ్యారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

లెనిన్‌కు నివాళి

గుంతకల్లుటౌన్: రష్యా సోషలిస్ట్ విప్లవం విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన లెనిన్ సిద్ధాంతాలను ప్రచారం చేస్తామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.చిన్నా, దేవేంద్ర, రామాంజి, ఆశాబీ, షేక్షా, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి


విజేతలకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఆత్మ రక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని ప్రముఖ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి సూచించారు. ఆదివారం తిలక్‌నగర్‌లోని ఇండియన్ హైస్కూల్‌లో ఏఎస్ గోజు రియు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో ఆత్మరక్షణ కల్పించుకునేందుకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా అమ్మాయిలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమన్నారు. దీని ద్వారా శారీరక, మానసిక ధృఢత్వాన్ని కలిగి ఉంటారన్నారు. కరాటే అకాడమీ ఆలిండియా చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ ఎం అల్తాఫ్‌షాషా, ఇన్‌స్ట్రక్టర్ ఫైరోజ్, గుంతకల్లు అకాడమీ ఇంచార్జ్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం


శ్రీరామపట్టాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: అయోధ్య శ్రీబాల రాముని విగ్రహం ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో జై శ్రీరామ్ భక్తమండలి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరాముని పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక గాంధీకట్ట వద్ద ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేసి చింతల వేంకటరమణస్వామి ఆలయం అర్చకుల ఆధ్వర్యంలో శ్రీరాముని పట్టాభిషేకాన్ని చేపట్టారు. ఉదయం 10 గంటలకు శాంతి హోమాన్ని నిర్వహించిన అనంతరం శ్రీరాముని పట్టాభిషేకాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం 1 గంటకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జైశ్రీరామ్ భక్తమండలి అధ్యక్షుడు రాధాకృష్ణ, శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు మహేశ్వరశర్మ, బీజేపీ నాయకులు పోతుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలశ స్థాపన పూజలు


అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో ఆదివారం కలశస్థాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 23, 24 తేదీల్లో ఆలయ 16వ జాతరను పురస్కరించుకుని పూజలు చేపట్టారు. ఈసందర్భంగా అంకాలమ్మ, కుంటెమ్మ దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి, నవగ్రహ, లలిత సహస్ర నామ హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

చురుగ్గా కుల గణన సర్వే


గుత్తి ఓల్డ్ సీపీఐ కాలనీలో కుల గణన చేస్తున్న దృశ్యం


పుట్లూరు మండలం సూరేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో మూడో రోజూ ఆదివారం కుల గణన కార్యక్రమం చురుగ్గా కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుల గణన చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా కుల గణన పూర్తి చేయాలి

పుట్లూరు: కుల గణన కార్యక్రమాన్ని తప్పిదాలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని అరకటివేముల, సూరేపల్లి, కడవకల్లు గ్రామాల్లో పర్యటించి కుల గణన కార్యక్రమంపై ఆరా తీశారు. అధికారులు, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి యాప్‌లో నిర్దేశించిన అన్ని వివరాలను నమోదు చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుత్తి వాసికి ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ జాకోబ్

గుత్తి: పట్టణానికి చెందిన డాక్టర్ సీహెచ్‌బి. జాకోబ్‌కు యాంబిషన్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024 వరించింది. హైదరాబాద్‌కు చెందిన యాంబిషన్ కెరీర్ కౌన్సిలర్స్ సంస్థ ఏటా తెలుగు రాష్ట్రాల్లో బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది మొత్తం 650 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు అవార్డుకు నామినేషన్లు పంపారు. రాయలసీమ నుంచి కర్నూలులోని బిట్స్ కాలేజీలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జాకోబ్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జాకోబ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి చేతుల మీదగా జాకోబ్ అవార్డు అందుకున్నారు. జాకోబ్‌కు అవార్డు దక్కడంతోస్నేహితులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు


నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

తాడిపత్రిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలస్థాయిలో ముగిసాయి. పెద్ద పోలమడ గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి విజేతలకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24నుంచి 30 వరకు నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలం నుంచి కబడ్డీలో గన్నెవారిపల్లి బాలుర జట్టు, యర్రగుంటపల్లి బాలికల జట్టు, ఖోఖోలో ఊరిచింతల బాలుర జట్టు, గన్నెవారిపల్లి బాలికల జట్టు, వాలీబాల్‌లో భగత్‌సింగ్ నగర్ బాలుర జట్టు, బ్రాహ్మణపల్లి బాలిక జట్టు, షటిల్ బ్యాడ్మింటన్‌లో వడ్లపాలెం బాలుర జట్టు, ఆస్పత్రిపాలెం బాలికజట్టు, క్రికెట్‌లో సుంకులమ్మపాలెం బాలుర జట్టు, గాంధీనగర్ బాలికల జటు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. ఈసందర్భంగా ఆయా జట్లను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, ఎంఈఓ నాగరాజు , పీఈటీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


కల్లూరులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

గార్లదిన్నె: కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం 1991-1992 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలు మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షేమాలు, కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందపడ్డారు. అనంతరం అప్పటి గురువులు ప్రసాద్‌రావు, అశ్వత్థనారాయణ, చెన్నప్ప, రమాదేవిని సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శారదబాయి, పూర్వ విద్యార్థులు త్రిలోక్‌నాథ్‌రెడ్డి, శివ ప్రసాద్, విజయకుమార్, ఆల్తాఫ్, శివశంకర్, చితంబరరెడ్డి, భాగ్యలక్ష్మి, నాగరత్నమ్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

గుంతకల్లుటౌన్: అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని సోమవారం స్థానిక కోదండ రామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ చైర్మన్ వై.శరణబసిరెడ్డి, ఈఓ మఠం మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, శ్రీరామ తారకమంత్ర జపం, హోమాలు, సహస్త నామార్చన, లక్షదీపార్చన ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు భక్తాదులందరికీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. నేడు శ్రీరామభక్త మండలి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సభ్యులు మంజుల వెంకటేష్, ఎం.కేశవలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హనుమాన్‌సర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆటో బోల్తా : ఐదుగురికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన ఆదినారాయణరాజు


చికిత్స పొందుతున్న విమలమ్మ

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. గుత్తికి చెందిన ఆదినారాయణరాజు, వరలక్ష్మి, నాగరాజు, విజయరామరాజు, విమలమ్మ మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో జరిగే బంధువుల దినకర్మకు వెళ్లారు. అనంతరం గుత్తికి వస్తుండగా పట్టణ శివారులోని స్పందన ఫంక్షన్ హాల్ ఎదుట ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆదినారాయణరాజును అనంతపురం తీసుకెళ్లారు. ఆ తర్వాత అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పుత్ర ఏకాదశి పూజలు


రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తుల ప్రాకారోత్సవ దృశ్యం


శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక తగ్గు దేవాలయం, చిన్న విఠోబ ఆలయంలో ఆదివారం పుత్ర ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తగ్గుదేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలు, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆయా ఆలయ భజనబృందాలు భజనల నడుమ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయ ప్రాంగణాలు గోవింద, జై విఠల నామస్మరణతో మార్మోగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఆదివార ఆరాధన


మాట్లాడుతున్న బ్రదర్ బాబావలి

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రారంభ సంవత్సర మొదటి మాస 3వ ఆదివారం ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దైవసేవకుడు బాబావలి మాట్లాడుతు మానవులు నీతి, సమాధానం కలిగి ఉండడం వల్లే ఐక్యత పెంపొందుతుందన్నారు. నీతి, సమాధానాలు ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా ప్రాప్తిస్తాయన్నారు. క్రీస్తుతోనే నిత్య జీవం లభిస్తుందన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, రత్నరాజు, అబ్రహాం, దేవదాసు, కరుణాకర్, ప్రసాద్, రజని, ప్రిస్కిల్లా, సునీలమ్మ, రేచెల్, మహిమ, కీర్తిమణి, వాణి, వాత్సల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ శారీరక శ్రమ అవసరమే



5 కే వాక్ ప్రారంభిస్తున్న ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ డైరెక్టర్లు మాంఛో, విశాల ఫెర్రర్

అనంతపురం: సామాజిక సేవ చేయడం ఎంత అవసరమో, శారీరక శ్రమ కూడా అంతే అవసరమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 కే రన్, 5 కే వాక్, కమ్యూనిటీ వాక్‌ను జిల్లా కలెక్టర్ వద్ద ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగరపాలక సంస్థ కమిషనర్ వై. మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాల ఫెర్రర్ , అల్బార్ న్నర్ జువాన మాన్యుయెల్ వైరా పాల్గొన్నారు. ఆర్డీటీ చేస్తున్న సేవా కార్యక్రమాలకు మద్దతుగా అల్ట్రా మారథాన్ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు మద్దతు ఇవ్వాలని ఈసందర్భంగా ముఖ్యఅతిథులు పిలుపునిచ్చారు. సామాజిక సేవ చేయడం ఎంత అవసరమో, శారీరక శ్రమ కూడా అంతే అవసరం అని అవగాహన కల్పించారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం


ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: అనంతపురం లోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన వీరాంజినేయులును పార్టీ శ్రేణులకు పరిచయం చేస్తామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు తరలిరావాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట, అమ్మలదిన్నె, సోమనపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో కోరాయి.

తాడిపత్రిటౌన్: యర్రగుంట పల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించనున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభించనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

రేపు జాతీయ గీతాలాపన

తాడిపత్రి అర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో జాతీయ గీతాలాపన చేయనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అశోక్‌పిల్లర్, గాంధీసర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్‌సర్కిల్ వద్ద లౌడ్ స్పీకర్ల ద్వారా జాతీయ గీతాన్ని ఆలపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ ప్రజలను కోరారు.

మహిళకు తీవ్రగాయాలు

పుట్లూరు: టిప్పర్ నుంచి రాళ్ల పడడంతో ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాలు..పి.చింతలపల్లి గ్రామా నికి చెందిన రాజేశ్వరి అనే మహిళ తన భర్త లక్ష్మీనారాయణ రెడ్డితో కలసి ద్విచక్ర వాహనంపై ఆదివారం తాడిపత్రికి వెళ్లింది. తాడిపత్రిలో పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరింది. ఈక్రమంలో అధిక లోడుతున్న వెళ్తున్న టిప్పర్ నుంచి రాళ్లు పడడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనలో ఆమె దంతాలు ఊడిపోయాయి. వెంటనే భర్త ఆమెను ఆస్పత్రికి తరలించాడు.

రామ, హనుమాన్ ఆలయాల ముస్తాబు

పెద్దపప్పూరు: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా ఆదివారం రామ, హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేశారు. సోమవారం ఇంటింటికీ పంపిణీ చేసిన అయోధ్యరాముని అక్షింతలను స్వామివారిపై చల్లి దర్శించుకోవడానికి వీలుగా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేయనున్నారు.